క్లుప్తంగా

సామాజిక న్యాయానికి పెద్దపీట



మరిపెడ: సామాజిక న్యాయానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్ అన్నారు. మంగళవారం మరిపెడ మండల కేంద్రంలోని భార్గవి ఫంక్షన్ హాలులో సంగటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డీసీసీ అధ్యక్ష పదవి ఎన్నిక కొరకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముందుంటుందని, కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్ రెడ్డి, వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, కాలం రవీందర్‌రెడ్డి, కమలాకర్ పాల్గొన్నారు.

టీజేవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా హర్షిత్



మహబూబాబాద్/కురవి: తెలంగాణ జాగృతి యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా హర్షిత్‌ను నియామకం చేశారు. కాగా సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో మంగళవారం చేరారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లూనావత్ అశోక్, నాయకులు నర్సింగ వెంకన్న, దాము పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



మహబూబాబాద్ అర్బన్: జాతీయస్థాయి ఉర్సు పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు సతీష్, హిందూ, కిరణ్‌కుమార్ ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు, పీడీ సింధువర్మ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో వివిధ రకాల క్రీడల్లో పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కూచిపూడిలో జాతీయ అవార్డు

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రానికి చెందిన రావుల యుగంధర్, అనితరెడ్డి దంపతుల కూతురు రావుల సాయిసంజనరెడ్డి ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయచూర్‌లో జరిగిన కూచిపూడి నృత్య పోటీలలో పాల్గొని నట్వర్ గోపికృష్ణ నేషనల్ అవార్డుతో పాటు నవోదిత్ కళాకారిణిగా గుర్తింపు పొందారు.


నిధులు విడుదల చేయాలి

మహబూబాబాద్: బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు వెంటనే విడుదల చేయాలని బీఎస్పీ రాష్ట్ర నాయకుడు శివరాజ్ డిమాండ్ చేశారు. బీఎస్పీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్ అర్బన్: సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని టౌన్ సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై కె.శివ, పీసీలు, హెచ్‌ఎం సిరినాయక్, ఉపాధ్యాయులు వాసుదేవ్, శరీరాం, ప్రతిభ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



బయ్యారం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 42మందికి మంజూరైన రూ.13,58,000 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, ఎంపీడీఓ దైవాధీనం, నాయకులు మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరువు కరకట్టలు పదిలమేనా?

- గత ఏడాది భారీ వర్షాలకు తెగిన 25చెరువుల కరకట్టలు
- ఇటీవల పునరుద్ధరణ చర్యలు
- నాణ్యతా ప్రమాణాలు పాటించని వైనం
- పర్యవేక్షణ చేపట్టని ఐబీ శాఖ అధికారులు
- మళ్లీ కురుస్తున్న భారీ వర్షాలు



చెరువుకు రివిట్‌మెంట్ లేకుండా మట్టితో నిర్మించిన కరకట్ట



ఎడ్జెర్ల పెద్ద చెరువు కరకట్టకు ఏర్పడ్డ పగుళ్లు

మరిపెడ రూరల్: గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు మండలంలోని గొలుసు కట్టు చెరువులు ఒక దాని తర్వాత మరొకటి చొప్పున కరకట్టలు తెగిపోయాయి. తెగిన చెరువుల్లో చుక్కనీరు లేకుండా దిగువ ప్రాంతంలో ఉన్న ఆకేరు వాగులో కలిసిపోయింది. దీంతో గత ఏడాది తెగిపోయిన చెరువుల ఆయాకట్టు కింద సాగు చేసుకున్న రైతాంగానికి నిరాశే ఎదురైంది. ఆ ఏడాది చెరువుల్లో జలం లేక సాగు చేసిన పంట చేతికి రాలేదు. అనంతరం కరకట్టల మరమ్మతులను చేపట్టాలని ఆయా గ్రామాల బాధిత రైతులు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. రైతుల అభ్యర్థన మేరకు ఆలస్యంగా చెరువుల కరకట్టల టెండర్లు వేశారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు ఏవి పట్టించుకోకుండానే తెగిపోయిన కరకట్టల గండ్లు పూడ్చారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లోపం రైతులకు శాపంగా మారింది.

25 చెరువుల కరకట్టలకు గండి

గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 25చెరువుల కరకట్టలు తెగిపోయాయి. చెరువులన్నీ గొలుసుకట్టు చెరువులు కావడంతో ఒకదాని తర్వాత ఒకటి చొప్పున చెరువులు తెగిపోయి సాగు నీరంతా దిగువన ఉన్న ఆకేరు నదిలోకి చేరింది. అదేవిధంగా మరో పక్క మత్స్యకారులు సొంతంగా చెరువుల్లో పోసుకున్న చేప పిల్లలు సైతం పిల్ల లేకుండా వరద నీటికి వెళ్లిపోయాయి. పోయిన ఏడాది వచ్చిన వరదలకు పంట పొలాలు ఇసుక మేటలు వేయడం తోపాటు పొలాలు కొట్టుకుపోయాయి. రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. మళ్లీ ఈ ఏడాది కూడా భారీ వర్షాలు కురుస్తుండడంతో పునరుద్ధరణ చేపట్టిన చెరువుల కరకట్టలు పదిలంగా ఉంటాయా అని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యతా ప్రమాణాలు డొల్ల..

తెగిపోయిన చెరువుల కరకట్టల మరమ్మతులకు టెండర్లు వేయడంతో కొంత జాప్యం చోటుచేసుకోవడంతో ఖరీఫ్ కాలం నెత్తిమీదకు వచ్చింది. అదే సమయంలో టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా కొన్ని చెరువు కట్టలను పునరుద్ధరించారు. ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లోపంతోపాటు కాంట్రాక్టర్లతో ఒప్పందం మూలంగా మండలంలోని ఎడ్జెర్ల చెరువు కరకట్ట మరమ్మతులు చేపట్టినప్పటికీ కట్ట భారీ పగుళ్లు చేటుచేసుకున్నాయి. చేసేది లేక అధికారులే వచ్చి చెరువు అలుగును (మత్తడి)ని పగలగొట్టి చెరువు సాగు జలాన్ని వృథాగా దిగువలో ఉన్న ఏటిలోకి వదిలారు. అదేవిధంగా చెరువు కరకట్టలను పునరుద్ధరించి చెరువు లోతట్టు వైపుగా కట్టకు రివిట్‌మెంట్ (రాయితో నిర్మాణం) చేయాల్సి ఉండగా కేవలం మట్టి పోసి చేతులు దులుపుకున్నారు. మండలంలోని బోట్యతండా గ్రామ పంచాయతీ పరిధిలో రూ.32లక్షలతో కరకట్ట పునరుద్ధరించి కేలవం మట్టి పోసి, రాళ్లు మాత్రం కట్టపైన పోసి వదిలేశారు. ఇప్పటికైన ఉన్నత స్థాయి ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి పటిష్టంగా కరకట్టల పునరుద్ధరణ పనులు చేసేల చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి



బహుమతులను అందజేస్తున్న నాగేశ్వర్‌రావు

మహబూబాబాద్ అర్బన్: పర్యావరణ ఉత్పత్తుల తయారీ వస్తువులను మాత్రమే వినియోగించి పరిరక్షణకు ప్రతీ ఒక్కరు తోడ్పడాలని తెలంగాణ పొల్యూషన్ బోర్డు కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ బి.నాగేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులతో ప్రకృతి పర్యావరణ అనుకూల వస్తువుల ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. లక్ష్మణ్‌నాయక్, ఏకో క్లబ్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు మసూద్ అహ్మద్, సాంబశివరావు, వినోద్, హాతిరామ్, ఖాసీంషా, సుమన్ పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



మాట్లాడుతున్న నాగయ్య

నెహ్రూసెంటర్: వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం సమగ్ర చట్టం తీసుకురావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికులను బీజేపీ ప్రభుత్వం విస్మరిస్తుందని, మత విద్వేషాలను రెచ్చగొడుతూ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి సమగ్ర చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. వ్యవసాయ కార్మికులకు రూ.12వేల పింఛన్, మహిళలకు రూ.2,500 పథకాలను అమలు చేయాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మండ రాజన్న, జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య, ఎండీ యాకుబ్, గొడిశాల వెంకన్న, వంగూరు వెంకటేశ్వర్లు, గణేష్, చంద్రకళ, రామేశ్వరం పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అనేక లాభాలు



దంతాలపల్లి: ఆయిల్‌పాం తోటను పరిశీలిస్తున్న అధికారులు

దంతాలపల్లి: ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అనేక లాభాలు ఉన్నాయని జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమల అధికారి మరియన్న అన్నారు. మండల కేంద్రంలోని ఆయిల్‌పామ్ సాగును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అనేక లాభాలు ఉన్నాయని గుర్తుచేశారు. రైతులకు ప్రభుత్వమే మొక్కలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో తొర్రూరు హెచ్‌ఓ మానసా, హెచ్‌ఈఓ విజయపాల్ రెడ్డి పాల్గొన్నారు.

నెల్లికుదురు: జిల్లా ఆయిల్‌పామ్ క్షేత్రంగా ఎదిగేందుకు రైతులంతా వరికి బదులుగా ఆయిల్‌పాం పంటల సాగు చేయాలని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమల అధికారి జినుగు మరియన్న కోరారు. మండలంలోని వివిధ గ్రామాలల్లోని ఆయిల్‌పామ్ పంటల సాగు, పండ్ల తోటలను మంగళవారం పరిశీలించారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: గర్భిణులు, పిల్లలు, బాలింతలు పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో జరిగిన పోషణ మాసం కార్యక్రమానికి ఆయన హాజరై, మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పోషణ్ అభియాన్ పోషణ మాసం కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ శిరీష, తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఏవో వెంకన్న, మెడికల్ ఆఫీసర్ నంబీకిశోర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, గుగులోతు దస్రూనాయక్, బండారు వెంకన్న, రావుల మురళీ, మూల భూలోక్‌రెడ్డి పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: నవంబర్ 5,6 తేదీల్లో జిల్లాలోని మరిపెడ మండల కేంద్రంలో జరగనున్న సీఐటీయూ 4వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ మంగళవారం పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆకుల రాజు, శ్రీనివాస్, రాజమౌళి, వీరన్న, నాగన్న, మల్లయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలి

తొర్రూరు: ఆరోగ్య పరిరక్షణపై ప్రతీ ఒక్కరూ దృష్టి సారించాలని ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్‌కుమార్ తెలిపారు. మహబూబాబాద్ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాంపులో భాగంగా మంగళవారం డివిజన్ కేంద్రంలోని దుబ్బతండాలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ మునుకుంట్ల యాదలక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీ స్రవంతి, అధ్యాపకురాలు రజిని, ఏఎస్‌ఎం శ్రీలత, వలంటీర్లు పాల్గొన్నారు.

పుట్టపర్తికి ప్రత్యేక బస్సు సౌకర్యం

తొర్రూరు: తొర్రూరు నుంచి పుట్టపర్తికి ప్రత్యేక బస్సు నడపనున్నట్లు డీఎం పద్మావతి తెలిపారు. పుట్టపర్తిలో జరిగే సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈనెల 22న తొర్రూరు నుంచి బస్సు బయలుదేరి 23న ఉదయం పుట్టపర్తికి చేరుకుంటుందన్నారు. టికెట్ ధర రూ.2,500 నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 80744 74984, 70321 82456 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం మరో ఉద్యమం



మాట్లాడుతున్న బాబు గౌడ్

నెల్లికుదురు: 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం మరో తెలంగాణ ఉద్యమానికి సిద్ధం కావాలని వామ పక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పెరుమాండ్ల బాబు గౌడ్, ఆలకుంట్ల సాయన్న బీసీల సమాజానికి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. న్యాయబద్ధంగా 42శాతం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తు బీసీలకు అన్యాయం చేస్తున్నారని అగ్రవర్ణాలపై మండిపడ్డారు. అనేక దశాబ్దాలుగా రిజర్వేషన్లను నిర్లక్ష్యం చేస్తు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి బీసీలు పార్టీలకు అతీతంగా పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చిర్ర సత్యనారాయణ, ఇరుగు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల భారాన్ని తగ్గించాలి



మాట్లాడుతున్న పట్ల మధు

మహబూబాబాద్ అర్బన్: కేయూ పరిధిలోని డిగ్రీ కోర్సుల మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వివిధ రకాల ఫీజుల భారాన్ని ప్రభుత్వం తగ్గించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పట్ల మధు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు మంగళవారం డిగ్రీ విద్యార్థుల ఫీజులను తగ్గించాలని నిరసన తెలిపారు. దీంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతారని, ప్రభుత్వం వెంటనే పెంచిన ఫీజులను తగ్గించాలని, లేని పక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు భాషాపాక పవన్, గుండ్ల రాకేష్, నాయకులు ప్రవీన్, సందీప్, మహేష్, జ్ఞానేశ్వర్, వివేక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్

తొర్రూరు రూరల్: బీఆర్‌ఎస్ బలోపేతానికి నిరంతరం పని చేస్తున్న మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని వెలికట్ట గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కోమాళ్ల వెంకట్‌రావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రిపిరాల, కంఠాయాపాలెం, తొర్రూరులో ఇటీవల మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి, ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తూర్పాటి అంజయ్య, మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, నలమాల ప్రమోద్‌గౌడ్, హనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, కుర్ర శ్రీనివాస్, ఎన్నమనేని శ్రీనివాస్, ధారావత్ జైసింగ్ పాల్గొన్నారు.

వసతి గృహం, గురుకులాల తనిఖీ



మరిపెడ రూరల్: రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మరిపెడ రూరల్: మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలుర గురుకుల డిగ్రీ కళాశాల, మిని బాలికల గురుకులాన్ని మరిపెడ ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి మంగళవారం సందర్శించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్న తీరును తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. అనంతరం మిని గురుకుల బాలికలతో కలిసి ఎంపీడీఓ సహపంక్తి భోజనం చేశారు.

నెల్లికుదురు: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం, కేజీబీవీ, ఆదర్శ పాఠశాల వసతి గృహాలను మంగళవారం మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కొత్తగూడ: మండలంలోని పోలారం కస్తూర్బా గురుకుల జూనియర్ కళాశాలను మంగళవారం మండల ప్రత్యేకాధికారి సురేష్ తనిఖీ చేశారు.

పరిశుభ్రత పాటించాలి

డోర్నకల్: గురుకులాల్లో పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేక అధికారి నర్సింహమూర్తి ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ ఇమ్మానియల్, ఎంపీడీఓ శ్రీనివాసనాయక్‌తో కలిసి ప్రత్యేక అధికారి మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల, కస్తూర్బా పాఠశాల, ఎస్సీ హాస్టల్‌లో తనిఖీలు నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

విజయవంతం చేయాలి

బయ్యారం: ఈనెల 28, 29, 30 తేదీల్లో వనపర్తిలో జరగనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర నాయకుడు జె.గణేశ్ పిలుపునిచ్చారు. బయ్యారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహాసభల విజయవంతం కోరుతూ మంగళవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సందీప్, సంపత్, మనోజ్, స్రవంతి, శ్రీలక్ష్మి, సరస్వతి పాల్గొన్నారు.

ఎస్‌ఓపై చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: గూడురు మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం స్పెషల్ ఆఫీసర్‌పై చర్య తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆంగోత్ చందులాల్, ఎస్‌టీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు రామన్ననాయక్ డీఈఓకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కేసముద్రం: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తమ బంగారు భవిష్యత్‌పై దృష్టి సారించాలని షీటీం ఎస్సై సునంద అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధి పాలిటెక్నిక్ కాలేజీ, జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లికార్జున్, శ్రీనివాస్, ఏఎస్సై సుధాకర్, హెచ్‌సీ సుధాకర్ పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

దంతాలపల్లి: వసతిగృహం ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని ఎంపీడీఓ విజయ అన్నారు. మండల కేంద్రంలోని పెద్దముప్పారం గ్రామంలో ఎస్సీ బాలుర వసతి గృహంను మంగళవారం ఆయన తనిఖీ చేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

బయ్యారం: యూరియా కోసం ఆటోలో వెళ్తూ ప్రమాదంలో గాయపడి క్షతగాత్రులైన మండలంలోని గురిమెళ్ల రైతులకు మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు ఒకొక్కరికి రూ.2వేల చొప్పున 8మందికి ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాతా గణేష్, నాయకులు మురళీకృష్ణ, సత్యనారాయణ, భద్రయ్య, రామారావు, సాంబయ్య, వెంకన్న పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలంలోని బొడ్లాడ గ్రామంలో యూపీఎస్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని మనిషా తండ్రి పులుగుజ్జ రాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు రూ.10వేల ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు కీర్తి రాంబాబు, తాళ్లూరి రవీందర్, మురళీ పాల్గొన్నారు.

తడిసిన మక్కలను కొనుగోలు చేయాలి

బయ్యారం: ఇటీవల కురిసిన వర్షాలతో తడిసిపోయిన మొక్కజొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం బయ్యారంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

సన్మానం

మరిపెడ రూరల్: మరిపెడ మున్సిపాలిటీ కేంద్రం పరిధిలోని ఆర్లగడ్డతండాకు చెందిన జాటోతు బాలాజీ కుమారుడు జాటోతు విజయ్ ఇటీవల గ్రూప్–1 ద్వారా డీఎస్పీగా ఎంపికయ్యాడు. కాగా మంగళవారం పలువురు బీఆర్‌ఎస్ నాయకులు విజయ్‌ను ఘనంగా సన్మానించారు.

ఉపాధి కూలీల ఆందోళన

బయ్యారం: తమకు రావాల్సిన వేతనాలు అందించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఉపాధి హామీ కూలీలు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు.

బురదమయంగా ఆర్‌యూబీ

నెహ్రూసెంటర్: పగిలిన డ్రైయినేజీ పైప్‌లైన్‌లు, లీకేజీల కారణంగా ఆర్‌యూబీ బురదమయంగా మారిందని సీపీఐ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్‌యూబీ వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, జలగం ప్రవీణ్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

గార్ల: గార్ల మండల బీసీ జేఏసీ కన్వీనర్‌గా సూత్రపు రాజును మంగళవారం గార్లలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వర్తక సంఘం భవనంలో తాళ్లూరి రవీందర్ అధ్యక్షతన బీసీ సంఘాల సదస్సు నిర్వహించారు. మండల కోకన్వీనర్లుగా కట్టా రమేష్, రెడ్డిమల్ల ఉమేష్, విద్యాసాగర్, వీరస్వామి, సంతోష్, బాదం రాజేష్, రవీందర్, ఉపేందర్, చెవుల మహేష్, శ్రీనుగౌడ్ నరేష్, వెంకటేశ్వర్లను ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా కోట ఉత్తరయ్య, గట్టు అనంతరాములు, కత్తి సత్యం, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

వేంకటేశ్వరస్వామి రథసేవ

గార్ల: వేంటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల అనంతరం గార్ల పురవీధులో మంగళవారం రాత్రి వేంకటేశ్వరస్వామికి రథ సేవను భక్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అజ్మీర బన్సీలాల్, లక్ష్మణ్‌నాయక్, పుల్లఖండం రమేష్‌బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన వెంకటయ్య

కొత్తగూడ: అక్రమంగా టేకు కలప తరలిస్తున్న టాటా ఏస్ ట్రాలీ వాహనాన్ని గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని పెగడపల్లి సబ్‌స్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కర్నెగండి గ్రామం నుంచి టేకు కలపను సాదిరెడ్డిపల్లికి చెందిన ఏపీ 36టీఏ 6356 నంబర్ గల టాటా ఏసీ వాహనంలో బంగారి వెంకటయ్య (50), డ్రైవర్ సందీప్‌లు నర్సంపేట వైపునకు తరలిస్తున్నారు. పెగడపల్లి సబ్‌స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈఘటనలో వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందగా, సందీప్ తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్‌తో సహా పారిపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్సై రాజ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడ్డ సందీప్‌ను పోలీస్ వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

కురవి: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన దారావత్ చందు, సుశీల ఇద్దరు మంళవారం స్కూటీపై మహబూబాబాద్ వైపుకు వస్తున్నారు. ఈ క్రమంలో బంచరాయి తండా వద్దకు రాగానే రోడ్డుపై గేదె తప్పించబోయే క్రమంలో స్కూటీ అదుపుతప్పి కిందపడగా ఇద్దరు కిందపడిపోయారు. గాయాలైన వారిని 108 వాహనంలో మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రికి తరలించారు.

దంతాలపల్లిలో..

దంతాలపల్లి: మండల కేంద్రానికి చెందిన సోమారపు సాలమ్మ మంగళవారం తన సొంత పనిపై బజారుకు వెళ్లి వస్తున్న క్రమంలో నర్సింహులపేట మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి తన కారుపై సాలమ్మను ఢీకొట్టాడు. ఆమె తలకు గాయమైంది. స్థానికులు చికిత్సనిమిత్తం 108లో తొర్రూరు ఆస్పత్రికి తరలించారు.

కారు బోల్తా.. ఇద్దరికి తీవ్రగాయాలు

గంగారం: కారు బోల్తా పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మడగూడెం–తిరుమలగండి ప్రధాన రహదారి మూలమలుపు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కారులో ఖమ్మం నుంచి నర్సంపేట వైపు వస్తున్నారు. గంగారం మండలంలోని మడగూడెం–తిరుమలగండి ప్రధాన రహదారి మలుపు వద్దకు రాగానే కారుబోల్తా కొట్టడంతో కారు చిన్న కాలువలో పడిపోయింది. కారులో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారి నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి 108లో తరలించారు.

ముగ్గురి అరెస్టు

కేసముద్రం: వేర్వేరు కేసుల్లో ముగ్గురు వ్యక్తులను మంగళవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మారంతండాజీపీ శివారు వెంక్యాతండాకు చెందిన బానోతు సురేష్, మున్సిపాలిటి పరిధి గిర్నితండాకు చెందిన ఆంగోతు భద్రులు ఓ కేసుల్లో కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతుండటంతో, నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ కాగా, అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. అదే విధంగా ఇనుగుర్తి మండల కేంద్రంలో భూమి విషయంలో ఓ వ్యక్తిపై, ఇనుపరాడ్డుతో కొట్టి గాయపరిచిన ఇదే గ్రామానికి చెందిన మోటామారి మహేందర్ అనే వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.